క్లుప్తంగా

కాలువ మరమ్మతులకు రూ.4.40 లక్షలు మంజూరు

నడిగూడెం : మండలంలోని సాగర్ ఎడమ కాలువకు అనుసంధానంగా ఉన్న కొమరబండ మేజరు కాలువ మరమ్మతులకు నీటి పారుదల శాఖ నుంచి రూ.4.40 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మేజర్ కాల్వలో పలు చోట్ల పూడిక తీయించాలని, కంపచెట్లను తొలగించాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మరమ్మతులు పూర్తయితే రామాపురం, ఎఖ్లాస్ఖాన్‌పేట, తెల్లబల్లి, రత్నవరం, వాయిలసింగారం గ్రామాల రైతుల పంట భూములకు నీరందుతుందని అన్నారు.

స్నేహితుని కుటుంబానికి చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

అనంతగిరి : మండలంలోని రంగయ్యగూడెం గ్రామానికి చెందిన లాల్‌సాహెబ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పేద కుటుంబం కావడంతో లాల్‌సాహెబ్ భార్య ఇద్దరు కుమారులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో త్రిపురవరంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003లో లాల్‌సాహెబ్‌తో పాటు పదవ తరగతి చదివిన తోటి విద్యార్థులు అతని కుటుంబానికి ఆదివారం రూ.60వేల ఆర్థిక సాయం చేసి చేయూతనందించారు. కార్యక్రమంలో మట్టపల్లి ఉపేందర్, నాగరాజు, భూక్యా రామ్మూర్తి, మట్టపల్లి విశ్వనాథం, చిట్యాల గురుమూర్తి, నాగెల్లి నాగరాజు, తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ మునగాల మండల నూతన కార్యవర్గం ఎన్నిక


అడిదెల వెంకటరెడ్డి, అధ్యక్షుడు


ఇరుగు కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి

మునగాల : పీఆర్‌టీయూ మునగాల మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల శాఖ సర్వసభ్య సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చింతరెడ్డి రామలింగారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు బొల్లికొండ కోటయ్య, రాష్ట్ర మాజీ అసోసియేట్ అధ్యక్షుడు ఓరుగంటి రవి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పప్పుల వీరబాబు సమక్షంలో ఈ ఎన్నిక జరిగినట్లు మాజీ అధ్యక్షుడు కాసాని నాగేశ్వరరావు తెలిపారు. మండల అధ్యక్షుడిగా అడిదెల వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఇరుగు కిరణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా రాజుల లక్ష్మీనారాయణ, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎరమాల జ్యోతి, కార్యదర్శిగా మేకల మధుబాబు, మహిళా కార్యదర్శిగా బుడిగె భూలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సామినేని శ్రీనివాసరావు, కట్కూరి మధుసూధన్‌రెడ్డి, కొల్లు వెంకటేశ్వర్లు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తీగల నరేష్, జిల్లా నాయకులు మట్టపల్లి రాము, ఓరుగంటి రంగారావు, పిన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని ఉపాధి హామీకి అనుసంధానం చేయాలి


కూలీలతో మాట్లాడుతున్న ప్రజా కళాకారుడు బాదె నర్సయ్య

గరిడేపల్లి : ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని ప్రజా కళాకారుడు బాదె నర్సయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో నాట్లు వేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడారు. నాట్లు, కోతలు, పత్తి, మిరప చేల పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కూలీలు నాగమణి, రమణ, రాములమ్మ, విజయ, అనసూయ పాల్గొన్నారు.

ఏఈఓలను సంప్రదించాలి

పాలకవీడు : రుణమాఫీ కాని రైతులు మండలంలోని రైతు వేదికల్లో ఏఈఓలను సంప్రదించాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రైతులు కుటుంబ సభ్యుల ఆధార్, రేషన్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ అకౌంట్ వివరాలను ఏఈఓలకు అందజేయాలని కోరారు.

నేడు చర్చి వార్షికోత్సవం

హుజూర్‌నగర్ : పట్టణంలోని సెయింట్ జోసెఫ్ చర్చి వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఫాదర్ మరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వార్షిక మహోత్సవంలో క్యాథలిక్ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శిక్షణ పొంది.. సాగులో పాటించి

- సేంద్రియ వ్యవసాయం, ఉత్పత్తులపై స్వయం సహాయక సభ్యులకు శిక్షణ
- సాగులో చీడ, పీడల నివారణకు కషాయాల తయారీపై అవగాహన
- వ్యవసాయంలో పాటిస్తున్న మహిళలు


క్షేత్ర సందర్శనలో ద్రవ, జీవామృతం తయారీ విధానాన్ని నేర్చుకుంటున్న సభ్యులు

నడిగూడెం : వ్యవసాయంలో రసాయనాల వాడకం రోజురోజుకూ పెరుగుతోంది. పెట్టుబడులు కూడా అధికమవుతున్నాయి. రసాయనాలతో పండించిన పంటలను ఆహారంగా తీసుకుంటుండడంతో రోగాల పాలవుతున్నాం. దీంతో ఇటీవల నడిగూడెం మండలంలోని సిరిపురంలో గల రైతు వేదికలో మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నాబార్డు ఆర్థిక సహకారంతో స్వయం ఉపాధిలో భాగంగా 30 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు సేంద్రియ వ్యవసాయంతో పాటు సేంద్రియ ఉత్పత్తులపై 15 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు, సేంద్రియ వ్యవసాయం చేస్తున్న అభ్యుదయ రైతుల చేత అవగాహన కల్పించారు. ముఖ్యంగా నేల సారం పెరగాలంటే పశువుల పెంట, చెరువు మట్టి, వర్మీ కంపోస్టు, జీవామృతం, ఘన జీవామృతం, పచ్చిరొట్ట సాగు, జీవన ఎరువులు తదితర వాటితో పాటు, సహజ సిద్ధంగా చీడ, పీడల నివారణ కోసం వేపగింజల కషాయం, నీమాస్త్రం, తూటికాడ కషాయం, వావిలాకు కషాయం, దశపత్ర కషాయం, ఆవు మూత్రం, పేడ, ద్రావణం, పుల్లటి మజ్జిగ, ఇంకా అనేక రకాల ద్రావణాలపై అవగాహన కల్పించారు. క్షేత్ర సందర్శనకు తీసుకెళ్లి సేంద్రియ పద్ధతులను వివరించారు. తమ కుటుంబ అవసరాల కోసం పలు రకాల సేంద్రియ ఎరువులు తయారు చేసుకొని, తోటి రైతులకు విక్రయించుకునేలా అవగాహన కల్పించారు. దీంతో శిక్షణ పొందిన పలువురు సభ్యులు తమ కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం అర ఎకరంలో సేంద్రియ వ్యవసాయం చేపట్టారు. పలువురు సభ్యులు ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారు చేసుకొని పొలాలకు వాడకం మొదలు పెట్టారు. చీడ, పీడల నివారణకు వేప గింజలు కూడా సేకరించుకున్నారు.

సేంద్రియ పద్ధతిలో అర ఎకరంలో సాగు చేపట్టాం



మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై ఇచ్చిన ప్రత్యేక శిక్షణతో సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన వచ్చింది. దీంతో మాకున్న వ్యవసాయ భూమిలో ఈ సీజన్‌లో ఒక అర ఎకరంలో సేంద్రియ వ్యవసాయం ప్రారంభించాం
– మొక్క నాగలక్ష్మి

సేంద్రియ ఎరువులు, కషాయాల తయారీ నేర్చుకున్నాం



15 రోజుల శిక్షణలో సేంద్రియ ఎరువులు, కషాయాల తయారీ నేర్చుకున్నాం. చీడ, పీడల నివారణకు ఆకులు, ఆవు మూత్రం, పేడ ద్రావణం, కషాయాల తయారీతో పాటు సేంద్రియ ఎరువులైన జీవామృతం, ఘన జీవామృతం, వర్మి కంపోస్టు, వేస్ట్ డీకంపోజర్, పచ్చిరొట్ట ఎరువులు గురించి నేర్చుకున్నాం.
– పసుపులేటి మల్లీశ్వరి

స్వయం ఉపాధికి మంచి అవకాశం



సేంద్రియ వ్యవసాయంపై ఇచ్చిన శిక్షణ బాగుంది. ఈ శిక్షణ మా స్వయం సహాయక సంఘాలకు ఉపాధికి కూడా మంచి అవకాశం. సొంతంగా గో ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి, బయట విక్రయిస్తే ఆదాయం పొందవచ్చు. మేము అర ఎకరంలో సేంద్రియ వ్యవసాయం ప్రారంభించాం.
– దొంతగాని పుల్లమ్మ

భక్తిశ్రద్ధలతో విగ్రహాలకు జలాభిషేకం



స్వామివార్ల విగ్రహాలు, ధ్వజస్తంభానికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

నేరేడుచర్ల : పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతిష్ఠించనున్న గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నవగ్రహాలు, శ్రీమాలికపురతమ్మ, శ్రీఅయ్యప్పస్వామి, కీర్తీ ధ్వజ స్తంభానికి వేదపండితులు వెంకటరమణశర్మ, సత్యనారాయణశర్మ, కిశోర్‌శర్మల వేదమంత్రోత్సవాల మధ్య భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం జలాభిషేకం, ధాన్య, పుష్ప, ఫలాభిషేకం నిర్వహించారు. యాగశాలలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, పంచామృతాభిషేకాలు, బలిహరణ, మూలమంత్ర సమేత అరుణ హోమం, మహామంత్ర హోమం, నిరాజన మంత్రం పుష్పం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ శాశ్వత ధర్మకర్త కొణతం కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, ఆలయ కమిటీ సభ్యులు యారవ సురేష్, దొంతిరెడ్డి వెంకటరమణారెడ్డి, దుర్గారావు, శావయ్య, పూర్ణచంద్రారెడ్డి, చిన్నపల్లి శ్రీనివాస్, వెంకటి హరి తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణాష్టమి విశిష్టతపై ప్రచారం


హుజూర్‌నగర్ : ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

హుజూర్‌నగర్ : శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా హుజూర్‌నగర్ ఈనెల 31 నిర్వహించబోయే శ్రీకృష్ణ భగవాన్ ఊరేగింపును జయప్రదం చేయాలని ప్రబోధ సేవా సమితి సభ్యులు కోరారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో శ్రీకృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం చేస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 26 నుంచి జరిగే శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక కోదాడ, హుజూర్‌నగర్ కమిటీల అధ్యక్షుడు పోటు వెంకటేశ్వర్లు, సభ్యులు ముత్తవరపు శైలజ, వంగాల మహేష్, ఉల్లి అరుణ, షేక్ రంజాన్ బీ, చల్లా నరసింహారావు, జాస్తి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీస్ అవార్డు గ్రహీతలకు సన్మానం


అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న కాకతీయ కమ్మ సంఘం నాయకులు

నేరేడుచర్ల : ఉత్తమ పోలీస్ అవార్డులు అందుకున్న నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన కాట్రగడ్డ శ్రీనివాస్‌రావు, సోమవరం గ్రామానికి చెందిన గంటా సత్యనారాయణలను ఆదివారం నేరేడుచర్లలో కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. చౌటుప్పల్ ఏఎస్ఐ కాట్రగడ్డ శ్రీనివాస్‌రావు ఇండియన్ పోలీస్ మెడల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం, గంటా సత్యనారాయణ సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్‌గా సేవలు అందిస్తూ కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం గ్రామానికే గర్వకారణమన్నారు. సుంకరి క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రావులపల్లి ప్రసాద్, కౌన్సిలర్లు సులోచనశ్రీనివాస్, వేమూరి నాగవేణినారాయణ, న్యాయవాది సుంకరి ప్రదీప్తి, నెమ్మగడ్డ సుబ్బారావు, తిరుపతయ్య, పున్నయ్య, పాతూరు శ్రీనివాస్‌రావు, రోశయ్య, మాదవరావు, వెంకటేశ్వర్‌రావు, చిట్టిబాబు, శ్రీను, కృష్ణవేణి, కిరణ్ తదితరులున్నారు.

ఘనంగా ముత్యాలమ్మ పండుగ


కోదాడరూరల్ : కోదాడలో ముత్యాలమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కోదాడరూరల్ : శ్రావణ మాసం సందర్భంగా కోదాడలో ముత్యాలమ్మ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు సౌకర్యాలు కల్పించారు.. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, ముత్యాలమ్మ, రైతు కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

గుడిబండలో..

మండలంలో గుడిబండలో ముత్యాలమ్మ పండుగను ఆదివారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు బోనాలతో వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నారాయణపురంలో..

చిలుకూరు : శ్రావణమాసం పురస్కరించుకొని చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామంలో ముత్యాలమ్మ పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ బొడ్రాయి, ముత్యాలమ్మ దేవాలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : మండల కేంద్రంలో ఆదివారం ముత్యాలమ్మ పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించారు. బొడ్రాయి, సారంగేశ్వరస్వామి చెరువు వద్ద ఉన్న ముత్యాలమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

మేళ్లచెరువు, కందిబండలో..

మేళ్లచెరువు : మండల కేంద్రంతో పాటు కందిబండ గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పొంగళ్లు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేకపోతులను బలిఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామాల పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

మునగాలలో..

మునగాల : మండల కేంద్రంలో ఆదివారం ముత్యాలమ్మ జాతరను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా గుడి వద్దకు చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించుకున్నారు. గ్రామస్తులు అమ్మవారికి కోళ్లు, యాటలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల పండుగతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది.


చిలుకూరు : నారాయణపురంలో..


మేళ్లచెరువులో..


మునగాల : బోనాలతో ఆలయానికి వెళ్తున్న యువతులు


కోదాడరూరల్ : గుడిబండలో..

సర్వాయి పాపన్నగౌడ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


హుజూర్‌నగర్ : పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


మోతె : రాఘవాపురంలో నివాళులర్పిస్తున్న కల్లు గీత కార్మిక సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకొని హక్కుల కోసం పోరాడాలని గౌడ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని ఇందిరాచౌక్‌లో పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.హుస్సేన్, బి.అమర్, టి.సాయిరాం, వి.కృష్ణ, కె.నరసింహారావు, పి.గోవింద్, అనంత్ శేఖర్, పి.నాగరాజు, లింగారావు, కె.రామ్‌చందర్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు.. సర్వాయి పాపన్నగౌడ్

చిలుకూరు : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆదర్శప్రాయుడని జైగౌడ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురగాని లింగయ్య గౌడ్ అన్నారు. ఆదివారం చిలుకూరు మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను జైగౌడ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొండా వీరబాబుగౌడ్, గౌడ సంఘం నాయకులు బెల్లంకొండ రాముడు, నాయకులు కట్టెకోల నాగయ్య, బెల్లంకొండ నారాయణ, సోందుమియా, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.


గరిడేపల్లి : సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు


చిలుకూరు: పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జైగౌడ ఉద్యోగ సంఘం నాయకులు

బహుజన విప్లవ వీరుడు పాపన్నగౌడ్

గరిడేపల్లి : బహుజన విప్లవ వీరుడు, గౌడ కుల బాంధవుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం గరిడేపల్లి మండల కేంద్రంలో మండల గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో చెన్నగాని పురుషోత్తంగౌడ్ అధ్యక్షతన పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కీతవారిగూడెంలో బహుజన సంక్షేమ సంఘం కన్వీనర్ రాంబాబుగౌడ్ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో రావుల రాములయ్య, బండ నర్సిరెడ్డి, మల్లారెడ్డి, పెండెం కాశయ్యభాస్కర్, నాగయ్య, అరవింద్, రావుల ఆదినారాయణగౌడ్, గుర్వయ్య, సైదులు, వెంకటేశ్వర్లు, బాదె నర్సయ్య, సైదయ్య, రామనాథం, నాగేశ్వరరావు, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

మోతె : మండలంలోని రాఘవాపురం, రావిపహాడ్ గ్రామాల్లో ఆదివారం కల్లు గీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబు, కల్లు గీత కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి బట్టిపల్లి నాగమల్లయ్య, సోమగాని మల్లయ్య, బాల లింగయ్య, సోమగాని వీరస్వామి, తండు సంజీవ, శ్రీకాంత్, గోదల సైదులు, తదితరులు పాల్గొన్నారు.

ఏడడుగులకు పైగా పెరిగిన బెండ మొక్క


బెండ మొక్క

చిలుకూరు: మండల పరిధిలోని రామ్‌చంద్రానగర్ మాజీ ఉప సర్పంచ్ బుడిగెం శ్రీను ఇంట్లో బెండ మొక్క 7 అడుగులకు పైగా పెరిగింది. సాధారణంగా బెండ మొక్క 5 అడుగుల వరకు పెరుగుతుంది. కొమ్మలు కూడా చాలా బలంగా పెరిగాయని, ఇప్పడే కాపు దశకు వచ్చిందని శ్రీను తెలిపారు.

అబ్రహం మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

మఠంపల్లి : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మేడి అబ్రహం మృతి పార్టీకి తీరని లోటని పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి అప్పయ్య, పీఏసీఎస్ మండల చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు సయ్యద్ నిజాం అన్నారు. ఆదివారం మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో అబ్రహం మృతదేహం వద్ద వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీటీసీలు కూరాకుల చెన్నయ్య, మేడి సామేలు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దేవపంగు అచ్చయ్య, నరసింహారావు, చింతల వెంకటనారాయణ, జమీల్, కోటయ్య, నాగుల్‌మీరా, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004- 05 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 19 సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ కుటుంబసభ్యుల యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాము కలిసి చదువుకున్న రోజుల నాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకుని ఆనందపడ్డారు. అందరూ కలిసి ఆటాపాటలతో సందడి చేసి ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమకు విద్యనేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చత్రునాయక్, ఉపాధ్యాయులు అమృతారెడ్డి, శ్రీనివాస్, వెంకటరెడ్డి, ప్రభాకర్, ఆంజనేయశర్మ, పూర్వ విద్యార్థులు కొత్తపల్లి నాగరాజు, జిట్టబోయిన నాగరాజు, చిలుకూరి రవి, నజీమా, రమ్య, నాగేశ్వరరావు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

చి'వరి'కి సాగు నీరందేలా చర్యలు


పంట కాలువలో పూడిక తీయిస్తున్న శంకర్‌నాయక్, గిరిజనులు

మఠంపల్లి : మండలంలోని క్రిష్టాతండా గ్రామంలో పంట కాలువలు అధ్వానంగా ఉండడంతో గుర్రంబోడు లిఫ్ట్ ద్వారా విడుదలయ్యే నీరు చివరి భూములకు అందడం లేదు. దీంతో స్థానికుడు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు శంకర్‌నాయక్ రూ.10 వేలు ఖర్చు చేసి, మరికొందరు గిరిజనుల సహకారంతో ఆదివారం జేసీబీతో కాలువల్లో పూడిక తీయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. గుర్రంబోడు ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే నీరు చివరి వరి పొలాలకు అందించేందుకు అధికారులు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ తులసీసైదా, రైతులు రాజునాయక్, చమ్మానాయక్, సైదులునాయక్, బాలాజీనాయక్, శ్రీను, గోపి, చిన్నోడు, సేవ్లా, లింగా, వెంకటేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.